నేడు, రేపు కలెక్టర్ల సమావేశం

- 6 నెలల పాలనపై సమీక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఈ నెల 11, 12 తేదీల్లో సిఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరగనుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్, నూతనంగా తీసుకొచ్చిన పాలసీలతో పలు అంశాలపై అధికారులతో సిఎం దిశా నిర్దేశం చేయనున్నారు. రానున్న నాలుగున్నరేళ్లలో ఏ విధమైన లక్ష్యాలతో ముందుకెళ్లాలన్న అంశాలపైనా ఈ సమీక్షా సమావేశాల్లో చర్చించనున్నారు. 26 జిల్లాల కలెక్టర్లు, 40 శాఖల హెచ్ఒడిల నుంచి శాఖలవారీ అభిప్రాయాలను సిఎం తెలుసుకోనున్నారు. ఈ నెల 11న ఆర్‌టిజిఎస్, వినతుల పరిష్కారం, గ్రామ, వార్డు సచివాలయాలు, వాట్సాప్ గవర్నెన్స్, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌పై చర్చిస్తారు. మధ్యాహ్నం నుంచి వ్యవసాయం, పశుసంవర్ధక, హార్టికల్చర్, పౌర సరఫరాలు, అడవులు, జలవనరులు, పంచాయతీరాజ్, ఉపాధి హామీ, రూరల్ వాటర్ సప్లై, సెర్ప్, పట్టణాభివృద్ధి, సిఆర్‌డిఎ, శాంతి భద్రతలు వంటి అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. ఈ నెల 12న పరిశ్రమలు, ఐటి, ఇండస్ట్రీస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్, విద్యుత్తు, మానవ వనరులు, ట్రాన్స్‌పోర్టు, రోడ్లు, భవనాలు, హౌసింగ్, హెల్త్, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, మహిళా సంక్షేమం, రెవెన్యూ, ఎక్సైజ్, మైన్స్, డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ప్లాన్స్ వంటి వివిధ అంశాలపై అధికారులతో సిఎం చర్చిస్తారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు, ఐపిఎస్ అధికారులు పాల్గొననున్నారు.

ల్యాండ్‌మైన్ పేలి జవాన్ మృతి

- జమ్ముకాశ్మీర్‌లో ఘటన
- మృతుని స్వస్థలం మార్కాపురం - నార్పలలో నివాసం

ప్రజాశక్తి-నార్పల (అనంతపురం)

జమ్ముకాశ్మీర్‌లో పేలిన ల్యాండ్‌మైన్‌లో అనంతపురం జిల్లా నార్పలలో నివాసం ఉంటున్న సుబ్బయ్య (32) మరణించారు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలోని రాయిపాడు గ్రామానికి చెందిన సుబ్బయ్య ఆర్మీలో జవాన్‌గా పని చేస్తున్నారు. ఈయన అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రం గవ్వల వీధికి చెందిన గవ్వల రామకృష్ణ కూతురు లీలావతిని పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వివాహ అనంతరం భార్యాపిల్లలను నార్పలలోనే ఉంచారు. సోమవారం మధ్యాహ్నం జమ్మూ కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో అక్కడ ల్యాండ్ మైన్ పేలింది. ఈ ఘటనలో సుబ్బయ్య తీవ్రంగా గాయపడి వీరమరణం పొందారు. ఆయనకు భార్య లీలావతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం నార్పలలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

సుబ్బయ్య (ఫైల్)

13న 'అన్నదాతకు అండగా వైసిపి'

- పోస్టర్ ఆవిష్కరించిన మాజీ మంత్రి అంబటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులకు అండగా నిలిచేందుకు, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 13న రాష్ట్ర వ్యాప్తంగా 'అన్నదాతకు అండగా వైసిపి' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పలువురు నాయకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వరి పంట వేసిన రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. అకాల వర్షాలు, వాయుగుండాల వల్ల ఒకవైపు పంట దిగుబడులు తగ్గగా, మరోవైపు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పిన వాట్సాప్ నెంబరుకు మెసేజ్ చేసినా పట్టించుకునేవారే లేరని చెప్పారు. ఇప్పటి వరకూ 10 శాతం ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేదన్నారు. దీనికి నిరసనగా అన్ని జిల్లా కలెక్టర్‌లకు వినతిపత్రాలు సమర్పిస్తున్నట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు రైతు వ్యతిరేకి అని ఆరోపించారు. అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ఇస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చారని, ఆ హామీ అసలు నెరవేరుస్తారో లేదో తెలియడం లేదని అన్నారు. పోస్టర్‌ను ఆవిష్కరించిన వారిలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, రుహుల్లా, మంగళగిరి సమన్వయకర్త వేమారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నారాయణమూర్తి, నిమ్మకాయల రాజనారాయణ తదితరులు ఉన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -కార్వేటి నగరం (చిత్తూరు జిల్లా)

బాలికపై అత్యాచారం కేసులో నిందితున్ని అరెస్ట్ చేశామని కార్వేటినగరం సిఐ హనుమంతప్ప తెలిపారు. చిత్తూరు జిల్లా కార్వేటినగరం పోలీస్‌స్టేషన్లో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్వేటి నగర మండలం గోపిశెట్టిపల్లికి చెందిన దినేష్ ప్రేమ పేరుతో బాలికను వంచించాడని, సినిమాకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని తెలిపారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- జనాభా ప్రాతిపదికన గిరిజన ప్రాంతానికి నిధులు కేటాయించాలి
- ప్రభుత్వ విధానాలతో జిసిసి నిర్వీర్యం : ఎస్.పుణ్యవతి
- సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా మహాసభ ప్రారంభం, బహిరంగ సభ

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ప్రజా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి అన్నారు. ఇందుకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రెండు రోజులపాటు జరగనున్న సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా 10వ మహాసభ కురుపాంలో మంగళవారం ఉత్సాహపూరితంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రావాడ జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను పూర్తిగా విస్మరించారన్నారు. దేశ సంపదను అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని, ప్రజలపై భారాలు మోపుతున్నారని వివరించారు. గిరిజనులకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సబ్‌ప్లాన్ నిధులు కేటాయింపులోనూ, ఖర్చులోనూ కేంద్రం వివక్ష చూపుతోందని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. నాడు గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్, గిట్టుబాటు ధర కల్పించేందుకు జిసిసిని ఏర్పాటు చేయగా, బిజెపి అధికారంలోకి వచ్చాక ఆ సంస్థను నిర్వీర్యం చేసిందని తెలిపారు. గిరిజన ఆవాసాలను పక్కనపెట్టి, కార్పొరేట్ శక్తులు ఖనిజ సంపదను దోచుకునేందుకు వీలుగా అటవీ ప్రాంతంలో సైతం అధిక నిధులతో భారీ రోడ్లు వేస్తున్నారన్నారు. జీడి, పామాయిల్ ధరలు అంతర్జాతీయంగా పెరుగుతున్నా మనదేశంలోని రైతులకు గిట్టుబాటు ధర ఎందుకు కల్పించడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

అభివృద్ధి ముసుగులో మతోన్మాదం : బి.తులసీదాస్

అభివృద్ధి ముసుగులో బిజెపి, సంఘపరివార్ శక్తులు మతోన్మాదాన్ని నింపుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. మతం పేరిట ప్రజలను విభజించే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కుట్రలను గుర్తెరిగి మత విద్వేషాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం వచ్చే నెల ఐదున విజయవాడలో పెద్ద ఎత్తున సభ నిర్వహించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు మతం ప్రాతిపదికన సభలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రజల అభీష్టం మేరకు వారి మత సంప్రదాయాలు ఆచరించుకునేందుకు పాలకులు స్వేచ్ఛ ఇవ్వాలని తెలిపారు. రాష్ట్రంలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సనాతన ధర్మాన్ని తన భుజాన వేసుకున్నారన్నారు. భర్త చనిపోతే భార్యని సతీసహగమనం పేరిట చంపేయాలని సనాతన ధర్మం సూచిస్తోందన్నారు. ఇలాంటి ధర్మాన్ని ప్రభుత్వంలో ఉన్న వ్యక్తి ప్రచారం చేయడం తగదన్నారు.

ప్రజల పేరిట అప్పులు చేసి కార్పొరేట్లకు ధారాదత్తం : కె.సుబ్బరావమ్మ

ప్రజల పేరిట రూ.వేల కోట్లు అప్పులు చేసి అదాని తదితర కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ విమర్శించారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులు పెరిగాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 65 ఏళ్ల పాలనలో రూ.55 వేల కోట్లు అప్పు చేస్తే, బిజెపి పదేళ్ల పాలనలో రూ.110 వేల కోట్ల అప్పులు చేసిందని వివరించారు. అప్పుగా తీసుకొచ్చిన మొత్తాన్ని ఏయే ప్రాంతాల్లో ఏయే వర్గాలకు ఎంతెంత ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

అధికారంలోకి రాగానే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న కేంద్రం ఆచరణలో ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేస్తూ నిరుద్యోగాన్ని సృష్టిస్తోందన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్, పార్టీ సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి తదితరులు ప్రసంగించారు. పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన వహించారు. బహిరంగ సభకు ముందు కురుపాం పాత బస్టాండ్ నుంచి రావాడ జంక్షన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనకు ముందు భాగంలో మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరోవైపు రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు కమ్యూనిస్టుల క్రమశిక్షణకు అద్దం పట్టింది. కొందరు గిరిజన యువకులు విల్లంబులు చేతబూని గిరిజన సంప్రదాయ వేటను, అడవితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. అనంతరం సీతారాం ఏచూరి నగర్‌లోని బుద్ధదేవ్ భట్టాచార్య ప్రాంగణంలో రుద్రరాజు సత్యనారాయణరాజు వేదికపై (సాయినందకి కల్యాణ మండపంలో) మహాసభ ప్రారంభమైంది.

బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి

కడప స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రమే నిర్మించాలి

- ఎపిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విభజన చట్టం ప్రకారం కడప స్టీల్ ప్లాంట్‌ను కేంద్రం నిర్మించి ఇచ్చేలా ప్రకటన చేయించాలని సిఎం చంద్రబాబును ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పి బిజెపికి ఇచ్చిన మద్దతును ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు విషయంలో కేంద్ర మంత్రి హెచ్‌డి కుమారస్వామి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలను అవమానించినట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ప్లాంట్ ప్రతిపాదనే తమ వద్ద లేదంటూ అపహాస్యం చేసేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఇంత జరుగుతున్నా.. రాష్ట్ర ఎంపిలు మౌనం వహించడం వారి చేతకాని తనానికి అద్దం పడుతోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం విభజన చట్టాన్ని కాలరాసిందని, సీమ ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని చెప్పారు. ఈ విషయంలో తమ వైఖరి ఏంటనేది సిఎం చంద్రబాబు వెల్లడించాలన్నారు. కేంద్రం పరిశీలనలో లేదనడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్థి స్తుందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వమే ప్లాంట్ నిర్మి స్తుందని చంద్రబాబు గతంలో శంకుస్థాపన చేస్తే, ప్రైవేటు భాగస్వామ్యం కూడా ఉండాలని జగన్ రెండు సార్లు కొబ్బరికాయ కొట్టారని పేర్కొన్నారు.

అప్పులతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-యల్లనూరు (అనంతపురం జిల్లా)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లా యల్లనూరు మండల పరిధిలోని గొడ్డుమర్రి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల తెలిపిన వివరాల మేరకు... గొడ్డుమర్రి గ్రామానికి చెందిన రైతు నాగప్ప (57)కు మూడెకరాల వ్యవసాయ పొలం ఉంది. ఇందులో వర్షాధార పంటలుగా వేరుశనగ సాగు చేసేవారు. ఇందు కోసం దాదాపు రూ.8 లక్షల వరకు అప్పులు చేశారు. గత నాలుగేళ్లుగా వర్షాభావ పరిస్థితులతో పంటలు చేతికందలేదు. అప్పులు తీర్చడం కష్టమై తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషగుళికలు మింగారు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో రైతు మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్రవ్యోల్బణం, వృద్ధి సమతుల్యత పెద్ద సవాల్

- సైబర్ మోసాల కట్టడిపై దృష్టి పెట్టాలి
- ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్
- ఆరేళ్ల తర్వాత పదవీ విరమణ

న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్‌గా ఆరేళ్లు పూర్తి చేసిన శక్తికాంత దాస్ మంగళవారం పదవీ విరమణ చేశారు. చివరి రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ద్రవ్యోల్బణం, వృద్ధి, సైబర్ మోసాలు ఆర్‌బిఐ ముందున్న ప్రధాన సవాళ్లని అన్నారు. సైబర్ సెక్యూరిటీ సవాళ్లను ఎదుర్కోవడానికి కొత్త సాంకేతికతలను ఉపయోగించడంపై దృష్టి సారించాలని సూచించారు. ద్రవ్యోల్బణం, వృద్ధి మధ్య సమతుల్యతను పునరుద్ధరించడం అత్యంత ముఖ్యమైన అంశమని అన్నారు. నాలుగేళ్లలో అత్యంత వేగంగా కూరగాయల ధరలు పెరగడంతో అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 6.21 శాతానికి చేరి 14నెలల గరిష్ఠ స్థాయి వద్ద నమోదయ్యిందని గుర్తు చేశారు.

పదవీ విరమణ సందర్భంగా ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎక్స్‌లో శక్తికాంత ధన్యవాదాలు తెలిపారు. ఇంతకాలం తనకు మద్దతుగా నిలిచిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పారు. తనకు అవకాశం కల్పించిన ప్రధానీ మోడీ మార్గదర్శకం, ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా ఆర్థిక మంత్రిత్వశాఖ, ఆర్‌బిఐల మధ్య సమన్వయం అత్యుత్తమంగా ఉందన్నారు. అసాధారణమైన పరిస్థితులను ఎంతో విజయవంతంగా ఎదుర్కొన్నామన్నారు. విశ్వాసం, విశ్వసనీయత సంస్థగా ఆర్‌బిఐ ఎదగాలని ఆకాంక్షించారు. నూతన గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్న సంజయ్ మల్హోత్రా అపారమైన అనుభవం కలిగి ఉన్నారన్నారు. ఆర్‌బిఐ కార్యకలాపాలను సమర్థవంగా నడిపించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

అసాధారణ వేగంతో విస్తరిస్తున్న విశ్వం

న్యూయార్క్ : విశ్వం ఊహించిన దానికన్నా అసాధారణ వేగంతో విస్తరిస్తోందని వెబ్ టెలిస్కోప్ డేటా ధ్రువీకరించింది. నాసాకు చెందిన జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ రెండేళ్ళపాటు ఇచ్చిన డేటా గతంలో హబుల్ రోదసీ టెలిస్కోప్ ఇచ్చిన డేటాతో సరిపోలుతోంది. విశ్వం విస్తరించే రేటు దాదాపు 8శాతం వేగంగా వుందని గతంలో హబుల్ పేర్కొంది. వందల కోట్ల సంవత్సరాల కాలంలో కాస్మోస్ కాంతి కిరణాల్లో తొలినాటి పరిస్థితులు, తదనంతర కాలంలో పరిణామ క్రమం గురించి ఖగోళ భౌతిక శాస్త్రవేత్తలు తెలుసుకున్న సమాచారం ప్రాతిపదికగా కన్నా చాలా వేగంగా విశ్వం విస్తరిస్తోందని భావించారు. అందుకే ఈ తేడాను హుబుల్ టెన్షన్‌గా పిలుస్తారు. మన దగ్గర గల అత్యుత్తమ సిద్ధాంతాలు పేర్కొన్నదాని కన్నా చాలా వేగంగా విశ్వం విస్తరిస్తోందని మేరీల్యాండ్‌లోని జాన్స్ హాప్కిన్స్ యూనివర్శిటీ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త ఆదమ్ రీస్ పేర్కొన్నారు. ఆయన నేతృత్వంలోని బృందం చేసిన అధ్యయన నివేదికను అస్ట్రో ఫిజికల్ జర్నల్‌లో సోమవారం ప్రచురించారు. ఇప్పటివరకు విశ్వం గురించి మన అవగాహనలో కొంత భాగం కోల్పోయినట్లు కనిపిస్తోందని రీస్ పేర్కొన్నారు. ప్రధానంగా రెండు అంశాలు - కృష్ణ బిలం, కృష్ణ శక్తి (డార్క్ మేటర్, డార్క్ ఎనర్జీ) గురించి మనం విస్మరించామని, కానీ అవే ఈ విశ్వంలో 96శాతం వున్నాయని అన్నారు. అందువల్ల ఇదేమీ చిన్న విషయం కాదన్నారు. 13-14 వందల కోట్ల సంవత్సరాల క్రితం సంభవించిన బిగ్ బ్యాంగ్‌తో ఈ విశ్వం ఆవిర్భవించింది, అప్పటి నుండి క్రమంగా విస్తరిస్తూనే వస్తోంది.

ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాం

- రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. టిడిపి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ స్వామినాయుడుతో కలిసి టిడిపి కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ.. గత ఆరు నెలల కాలంలో వచ్చిన 67 వేల రెవెన్యూ ఫిర్యాదులు, రీసర్వేపై వచ్చిన 2.67 లక్షల ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో అక్కడికక్కడే కొన్నింటిని పరిష్కరిస్తున్నామని చెప్పారు. పరిష్కరించలేని వాటిని ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో కూడా ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు.

భూ బకాసురులు.. వైసిపి నేతలు : పంచుమర్తి అనురాధ

రాష్ట్రంలో వైసిపి నేతలు భూ బకాసురులుగా మారారని శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ విమర్శించారు. అసైన్డ్, ఇనాం, ఫ్రీ హోల్డ్, దేవాదాయ, అటవీశాఖకు సంబంధించిన భూములను దేనినీ విడిచిపెట్టలేదన్నారు. టిడిపి కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు.

ప్రచార ఆర్భాటమే!

రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారం తక్కువే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు నాలుగు రోజులుగా గ్రామాల వారీ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. రెవెన్యూ సదస్సుల గురించి ప్రచారం ఎక్కువగా జరగ్గా, సమస్యల పరిష్కారమేమో అదే స్థాయిలో జరగడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో 1,012 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, నేటి వరకు సదస్సులకు 62,868 మంది హాజరైనట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. వీటిలో 19,403 అర్జీలను ప్రభుత్వం స్వీకరించగా, అందులో కేవలం 170 సమస్యలకు తక్షణ పరిష్కారం లభించింది. దీంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమౌతోంది.

ఆర్‌ఒఆర్ కోసం 7,207, అసైన్‌మెంట్ హౌస్ సైట్స్ కోసం 1,116, ఏజెన్సీ ల్యాండ్ ప్రాబ్లమ్స్ కోసం 872, అసైన్‌మెంట్ ప్రభుత్వ భూమి కోసం 751 దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. భూముల రీసర్వే గ్రీవెన్స్ కోసం 710, బౌండరీ డెమొక్రేషన్ కోసం 658, రీ సర్వే-ఎస్ఎస్ఎల్ఆర్ కోసం 416, ఎఫ్ లైన్ పిటిషన్స్ 319, 22(ఎ) భూములను అందులో నుంచి మినహాయించాలని కోరుతూ 280, రెవెన్యూ గ్రీవెన్స్ కోసం 234 దరఖాస్తులు అందాయి. ఇవికాక ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలంటూ 6,849 వినతులు అందాయి.

త్వరలో క్రిస్మస్ కానుక

- సాంఘిక సంక్షేమ మంత్రి డోలా వీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

త్వరలో క్రైస్తవులందరికీ క్రిస్మస్ కానుక అందిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. విజయవాడ నాలుగో డివిజన్ వరలక్ష్మి నగర్‌లో రూ.80 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంబేద్కర్ విదేశీ విద్యా దీవెన పథకాన్ని పునరుద్ధరిస్తామని, రాష్ట్రంలో రూ.340 కోట్లతో నూతన ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను నిర్మిస్తామని తెలిపారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా డిసెంబర్, జనవరి నెలల్లోని రుణాలు అందిస్తామన్నారు. ఎస్‌సి సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధరిస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులతో ప్రారంభించిన కమ్యూనిటీ హాళ్లను సాధారణ నిధులతో పూర్తి చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాళ్లను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. లిడ్‌కాప్‌కు నిధులు, రుణాలు అందిస్తామని, విజయవాడ ఆటోనగర్‌లో విలువైన భూములను అన్యాక్రాంతం చేశారని, వాటిని స్వాధీనం చేసుకుని పిపిపి మోడల్‌లో అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాల మరమ్మతులకు రూ.140 కోట్లు కేటాయించామని తెలిపారు. వసతి గృహాల విద్యార్థులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామన్నారు. అమరావతిలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి స్థలం కేటాయిస్తే గత ప్రభుత్వం స్థలాన్ని మార్చు చేసి విజయవాడ స్వరాజ్య మైదానంలో ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని విమర్శించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రాజెక్టుకు సంబంధించి అసంపూర్తిగా ఉన్న హాళ్ల, తదితర పనులను పూర్తి చేస్తామన్నారు. విజయవాడలో వసతి గృహాల మరమ్మతులకు రూ.42 లక్షలు కేటాయించామని, విద్యార్థుల హాస్టల్ బకాయిలను డిసెంబర్‌లోనే చెల్లిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ పాల్గొన్నారు.

పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయండి

- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కూటమి ఎంపిల వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయాలని టిడిపి కూటమి ఎంపిలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం నాడిక్కడ రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను టిడిపి, జనసేన, బిజెపి ఎంపిలు కలిశారు. అమరావతితోపాటు వారివారి నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన వినతులను పరిశీలిస్తున్నామని కేంద్ర మంత్రి తెలిపారు.

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ (భారత ప్రభుత్వ సంస్థ)
H.O.: లా & రికవరీ డిపార్ట్‌మెంట్, ఫ్లాట్ 5, బ్లాక్ 3, NBCC లాన్స్, ఈస్ట్ కిడ్వాయ్ నగర్, న్యూ ఢిల్లీ-110023. E-mail: ho.lr@psb.co.in
న్యాయవాదులు/న్యాయ సంస్థల ఎంపానెలమెంట్ కొరకు నోటీసు
పంజాబ్ & సింధ్ బ్యాంక్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మరియు ఒడిశా ప్రాంతంలో న్యాయవాదుల/ న్యాయ సంస్థల ఎంపానెలమెంట్ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. అర్హత వివరాలు మరియు అనుబంధాల కొరకు, దయచేసి PSB అధికారిక వెబ్‌సైట్ https://punjabandsindbank.co.in/ లోని Miscellaneous Section క్రింద "ఎంపానెలమెంట్ ఆఫ్ అడ్వకేట్స్/లా ఫర్మ్స్"ని సందర్శించండి. న్యాయవాదులు/న్యాయ సంస్థలు 6వ దరఖాస్తును అనుబంధం-III లో నిర్ణీత విధంగా సంబంధిత పత్రాలు, రాష్ట్రమండ్ల మెడల్లైన వాటితో పాటు అనుబంధం B, C & D లో నిర్ణీత ఫార్మాట్‌లో 20.12.2024 నాటి లేదా అంతకు ముందు జోనల్ ఆఫీస్, విజయవాడ, మంజాల్ & సింధ్ బ్యాంక్, హౌసింగ్ నెం. 14-14-48/1, నాజరావ్ అంతస్తు, ఆర్.టి. సర్కిల్ దగ్గర, సర్పోర్ రోడ్డు, శ్రీనివాసపురం, బ్యాంక్ కాలనీ, కీర్తి టవర్స్ ప్రక్కన, విజయవాడ, ఎపి 520008 నందు సమర్పించగలరు.
ఎంపానెలమెంట్ యొక్క నిబంధనలు మరియు షరతులు దరఖాస్తు దాఖలుపై అందుబాటులో ఉంటాయి మరియు ఏ కారణమూ చూపకుండా దేనినైనా తిరస్కరించే హ